క్లుప్తంగా

జగనన్న పెళ్లి కానుక రూ.లక్ష మంజూరు



పెళ్లి కానుక చెక్కును అందిస్తున్న కౌన్సిలర్ చింతకుంట సరితా రెడ్డి

ప్రొద్దుటూరు: స్థానిక 17వ వార్డుకు చెందిన షేక్ షాహిన్‌కు జగనన్న పెళ్లి కానుక ద్వారా ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేసింది. వార్డు కౌన్సిలర్ చింతకుంట సరితారెడ్డి చేతుల మీదుగా చెక్కును సోమవారం షాహిన్‌కు అందించారు. వార్డు వెల్ఫేర్ సెక్రటరీ నరేష్‌రెడ్డి, వలంటీర్ దౌలా, కందరూ రాజేష్ పాల్గొన్నారు.

15న విద్యుత్ అదాలత్

మైదుకూరు : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న బుధవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ జీవీ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు విద్యుత్ డివిజన్ కార్యాలయ ఆవరణలో 15న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ఈ అదాలత్‌లో మైదుకూరు, బద్వేలు నియోకవర్గాలలోని అన్ని మండలాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. అదాలత్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక అధ్యక్షుడు కె.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యురాలు జి.ఈశ్వమ్మ పాల్గొంటారని వివరించారు.

రేపు బద్రిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండలంలోని బద్రిపల్లె గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇస్తామన్నారు. ఇదే క్రమంలో ఇళ్లలో ఉండే దీర్ఘకాలిక రోగులకు సైతం వారికి ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు చేస్తామని వైద్యాధికారి చెప్పారు.

నేడు ఆంజనేయస్వామి వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హనుమాన్ నగర్‌లోని కోతి సమాధి వద్ద ఆంజనేయస్వామి మహోత్సవాలు, 35వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ, సాయంత్రం తొట్టి మెరవణి, బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వినియోగం ఉంటాయని వారు పేర్కొన్నారు.

పోలింగ్‌ను పరిశీలించిన ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి



దువ్వూరు: వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి పరిశీలించారు. పోలింగ్ తీరుపై ఆయన ఆరా తీశారు.

'సెల్'ఫోన్లకు ప్రత్యేక సెల్

బద్వేలు అర్బన్ : మొబైల్ ఫోన్లు.. ఇవి చేతుల్లో, జేబుల్లో లేకుండా రోజు గడవని పరిస్థితి. కానీ ఎన్నికలు, ప్రముఖ ఆలయాల సందర్శన వంటి కొన్ని సందర్భాల్లో తప్పనిసరిగా వీటిని పక్కన పెట్టాల్సిన అవసరం ఉంది. తాజాగా సోమవారం జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పోలింగ్ బూత్‌లలోకి సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని ఎన్నికల అధికారులు పత్రికల ద్వారా, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించినప్పటికీ అధిక శాతం మంది పోలింగ్ బూత్‌లలోకి తమ వెంట సెల్‌ఫోన్లు తీసుకువచ్చారు. దీంతో అక్కడే ఉన్న పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఓటర్ల నుండి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని బూత్‌లలోకి పంపించారు.

యోగాతో ఒత్తిడి దూరం

పోరుమామిళ్ల: యోగాతో మానసిక ఒత్తిళ్లు దూరం అవుతాయి. ప్రతి వ్యక్తి ఆధ్యాత్మికంగా, భౌతికంగా జీవిత సమతుల్యత సాధించేందుకు యోగా మహోత్సవం దారి చూపుతుందని హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్ సత్యప్రవీణ్ పేర్కొన్నారు. పోరుమామిళ్లలో ఆ సంస్థ తరఫున మూడు రోజుల యోగా మహోత్సవం నిర్వహిస్తున్నారు. సోమవారం ట్రైనర్ సత్యప్రవీణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక విభాగం, శ్రీ రామచంద్ర మిషన్ సంయుక్తంగా దేశమంతటా యోగా మహోత్సవం నిర్వహిస్తున్నట్ల తెలిపారు. అందులో భాగంగా పోరుమామిళ్లలో 12, 13, 14 తేదీల్లో ఉదయం 7 నుండి 8 గంటల వరకు ఒక బ్యాచ్‌కు, సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఒక బ్యాచ్‌కు యోగా మహోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. ధ్యానం, ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు చేయ డం ద్వారా ఒత్తిడి నుంచి దూరమయి, రోగా లు లేని ఆనందమయ జీవితాన్ని కొనసాగించగలరని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉపాధ్యాయ ఓటర్లు



రాజుపాళెంలో ఓట్లు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

ప్రొద్దుటూరు క్రైం : ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రొద్దుటూరులో ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం నుంచే ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ప్రొద్దుటూరులోని వైవీఎస్, వసంతపేట పాఠశాలల్లో ఓటు వేయడానికి పెద్ద ఎత్తున ఓటర్లు తరలి వచ్చారు. పోలింగ్ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు మైదుకూరు రోడ్డు, కొర్రపాడు రోడ్డు, టీబీరోడ్డులో వాహన రాకపోకలను నిలిపేశారు. అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్‌లు నిరంతర పర్యవేక్షణలో పటిష్ట పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. వైవీఎస్ పాఠశాల పోలింగ్ కేంద్రం సమీపంలో ఉన్న వాహనాలను అడిషనల్ ఎస్పీ, ఏఎస్పీ ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీ చేశారు. ఎస్పీ అన్బురాజన్ ప్రొద్దుటూరులోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ, ఏఎస్పీలకు సూచనలు చేశారు. పదే పదే పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్తున్న టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అభ్యంతరం తెలిపారు.

పట్టభద్రుల ఎన్నికల్లో 67.87 శాతం పోలింగ్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి సోమవారం జరిగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో 67.87 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం మండలానికి సంబంధించి 13,844 ఓట్లు ఉండగా వీరి కోసం వసంతపేట, వీవైఎస్ గర్ల్స్ మున్సిపల్ హైస్కూళ్లు, రమణ మహర్షి హైస్కూల్, కొశెట్టి చిన్న వెంకటసుబ్బయ్య హైస్కూళ్లలో మొత్తం 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

■ స్థానిక కొశెట్టి చిన్నవెంకటసుబ్బయ్య పాఠశాలలో ఏర్పాటు చేసిన 28వ పోలింగ్ బూత్‌లో ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించారు. అందరికీ ఒకే పోలింగ్ బూత్ కావడంతో పొడవాటి క్యూ కనిపించింది. పోలింగ్ ప్రారంభమైన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6.20 గంటల వరకు ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1234 ఓట్లకుగాను 1122 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. దాదాపు 91 శాతం పోలింగ్ నమోదు అయింది.

ఉపాధ్యాయులకు ధన్యవాదాలు

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ప్రొద్దుటూరులోని వైవీఎస్ గర్ల్స్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం ఆయన పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రాజుపాళెం : రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రులకు సంబంధించి 1092 ఓట్లు ఉండగా, 783 పోల్ అయ్యాయి. 71.70 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి 34 ఓట్లకుగాను 34 ఓట్లు పోలై 100 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచి పోలింగ్ తక్కువగా నమోదు కాగా మధ్యాహ్నం సమయం నుంచి ఓటు వేసేందుకు పట్టభద్రులు బారులు తీరారు. పలువురు మహిళలు చంటి బిడ్డలను ఎత్తుకుని వచ్చి ఓటు వేశారు. ఎటువంటి సమస్యలు జరగకుండా రాజుపాళెం ఎస్ఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల సరళిని ఏఎస్పీ అడ్మిన్ తుషార డూడి, ఏఎస్పీ ప్రేరణకుమార్ పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం పోలింగ్ బాక్స్‌లను కడపకు తరలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తహసీల్దార్ ఇందిరారాణి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డి తమ సిబ్బందితో పర్యవేక్షించారు.



టూ టౌన్ సీఐ ఇబ్రహీంకు సూచనలు ఇస్తున్న ఎస్పీ అన్బురాజన్



పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకుని వస్తున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి



ఓటు వేయడానికి వెళ్తున్న యువతులు



రాజుపాళెంలో ఓటేసేందుకు చంటి బిడ్డతో వచ్చిన మహిళ



ప్రొద్దుటూరులో వాహనలు తనిఖీ చేస్తున్న పోలీసులు

బద్వేలులో..

- ఓటుహక్కును వినియోగించుకునేందుకు తరలివచ్చిన పట్టభద్రులు
- గత ఎన్నికలతో పోలిస్తే భారీగా పెరిగిన పోలింగ్ శాతం
- సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిన పోలింగ్

బద్వేలు అర్బన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం బద్వేలులో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు భారీగా తరలిరావడంతో గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం భారీగా నమోదైంది. ఉపాధ్యాయ ఓటర్లు సైతం అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. బద్వేలు మండలానికి సంబంధించిన పట్టభద్రుల ఓటర్లకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు బూత్‌లు, ఉపాధ్యాయ ఓటర్లకు ఒక బూత్ కేటాయించారు. గోపవరం మండలానికి సంబంధించి పట్టభద్రుల ఓటర్లకు ఫాతిమా ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో రెండు బూత్‌లు, ఉపాధ్యాయ ఓటర్లకు ఒక బూత్ కేటాయించారు. ఉదయం 8 గంటల నుండి ఓటింగ్ ప్రారంభమైనప్పటికీ 10 గంటల వరకు ఓటింగ్ మందకొడిగా సాగింది. అనంతరం 11 గంటల నుండి ఓటింగ్ శాతం ఊపందుకుంది. సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ సమయం ముగిసేనాటికి బద్వేలు మండలానికి సంబంధించిన 7వ బూత్‌లో, గోపవరం మండలానికి సంబంధించిన 9వ బూత్‌లో భారీగా ఓటర్లు వేచి ఉన్నారు. దీంతో గడువు ముగిసే సమయానికి క్యూలో ఉన్న ఓటర్లతో ఓటు వేయించారు. సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. బద్వేలుకు సంబంధించి రెండు బూత్‌లలో మొత్తం 2195 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 1551 మంది ఓటుహక్కును వినియోగించుకోవడంతో 70.66 శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే బద్వేలు మండలంలో 198 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 185 మంది ఓటుహక్కును వినియోగించుకోవడంతో 93.43 శాతం ఓటింగ్ నమోదైంది. బద్వేలు, గోపవరం మండలాల్లో జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని ఆర్డీఓ ఆకులవెంకటరమణ, అడిషనల్ ఎస్పీ నీలంపూజిత, మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్‌లతో పాటు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి రత్నకుమారి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తదితరులు పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ హనుమంతనాయక్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



బద్వేలు అర్బన్: జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఓట్లు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

కలసపాడులో..

కలసపాడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 857 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 609 మంది, 50 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 48 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలో పట్టభద్రులు 71 శాతం, ఉపాధ్యాయ 96 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దారు జీ.రవిశంకర్ తెలిపారు. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం ఓటర్లు బారులు తీరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నాగమురళి గట్టి బందోబస్తు నిర్వహించారు.



పోలింగ్ సరళని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆకులవెంకటరమణ



కలసపాడులో ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు

బి.కోడూరులో..

బి.కోడూరు : మండల కేంద్రమైన బి.కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. తహసీల్దారు విద్యాసాగర్, ఎస్ఐ నజ్రీన్‌లు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి మొత్తం 27 మంది ఓటర్లు ఉండగా 24 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి 498 మంది ఓటర్లు ఉండగా 366 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.

అట్లూరులో..

అట్లూరు: అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతగా ముగిశాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లు 606 ఉండగా 441 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించిన ఓట్లు 13 ఉండగా 13 పోలయ్యాయి.

మైదుకూరులో..

మైదుకూరు : మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో ఉదయం 8 గంటల నుంచి ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్ 29లో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికకు నిర్వహించిన పోలింగ్‌లో 296 ఓట్లకు గాను 277 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 93.58 శాతం పోలింగ్ నమోదైంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు 69, 69ఏ, 70, 71 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం 2933 ఓటర్లుండగా మొత్తం 2138 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ 72.89 శాతంగా నమోదైంది. పోలింగ్‌ను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వై.భవానిశంకరి, అదనపు ఎస్పీ నీలం పూజిత, బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ పరిశీలించారు. మైదుకూరు డీఎస్పీ వంశీధర్ గౌడ్, ఇన్‌చార్జి సీఐ నాయుడు, అర్బన్ ఎస్ఐలు మద్దిలేటి, సీవీ రమణ సిబ్బంది పర్యవేక్షించారు. తహసీల్దార్ అనురాధ, ఎన్నికల డీటీ అలీఖాన్, ఆర్ఐ రోహిత్ సిబ్బంది పలోఇంగ్‌ను నిర్వహించారు.

చాపాడులో 77.96శాతం..

చాపాడు : పశ్చిమ రాయలసీమ శాసనమండలి ఎన్నికలలో భాగంగా చాపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎన్నికలలో 77.96 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దారు సుభానీ తెలిపారు. మండల వ్యాప్తంగా 1071 మంది పట్టభద్రులు ఉండగా వీరిలో 835 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 66 ఉపాధ్యాయులు ఉండగా వీరిలో 62 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల సరళిని ట్రైనీ కలెక్టర్ కృష్ణ నాయక్, డీఎస్పీ వంశీధర్ గౌడ్ పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ కేసీ రాజు ప్రతిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు.



చాపాడు: పోలింగ్ కేంద్రం వద్ద పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ కృష్ణ నాయక్

మానవత్వం చాటుకున్న వైద్య సిబ్బంది..

ఎన్నికల వేళ చాపాడులో వైద్య సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. వైద్యాధికారి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించగా అక్కడికి ఓటు వేసేందుకు ఓ మహిళ చంటి బిడ్డతో వచ్చింది. ఆ మహిళ ఓటు వేసి వచ్చేంత వరకు అక్కడ ఉన్న ఏఎన్ఎంలు చంటి బిడ్డను అక్కున చేర్చుకుంది. వైద్య సిబ్బంది తీరుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



చాపాడు: బారులు తీరిన పట్టభద్రులు

బి.మఠంలో..

బ్రహ్మంగారిమఠం : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో మండలంలో పట్టభద్రుల ఓట్లు 898 ఉండగా 622 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ ఓట్లు 84 ఉండగా 80ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. స్థానిక ఎస్ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌లోనికి స్థానిక విలేకరులను కూడా అనుమతించలేదు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



బ్రహ్మంగారిమఠం: బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఖాజీపేటలో 72 శాతం

ఖాజీపేట : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పక్రియ ప్రశాంతంగా పూర్తయింది. ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడంతో ప్రశాంత వాతావరణంలో జరిగింది. 1611 మంది పట్టభద్రులకు గాను 1168 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 72శాతం పోలింగ్ నమోదైంది. గతంతో పోల్చితే ఇంత అధికంగా పోల్ కావడం ఇదే తొలిసారని అధికారులు అంటున్నారు. 89 మంది ఉపాధ్యాయులకు గాను 83 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఖాజీపేట: బారులు తీరిన ఓటర్లు

దువ్వూరులో..

దువ్వూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సోమవారం దువ్వూరు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన పోలింగ్ ముగిసింది. మండలవ్యాప్తంగా 1140 పట్టభద్రుల ఓట్లు ఉండగా 886 ఓట్లు పోలయ్యాయి. వీరిలో పురుషులు 698, మహిళలు 188 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 63 ఉండగా 61 మందిలో పురుషులు 48 మంది, మహిళలు 13 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 97 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజలు వైఎస్సార్‌సీపీ పక్షాన ఉన్నారు

ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాల వలన ప్రజలు అన్ని రకాలుగా సంతోషంగా ఉన్నారని ప్రజలు వైఎస్సార్‌సీపీ పక్షాన నిలుస్తున్నారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల జరుగుతున్న సందర్భంగా బి.మఠంకు ఎమ్మెల్యే వచ్చారు ఈసందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చెందిన వారు అధిక మెజార్టీలో గెలవడం ఖాయమన్నారు. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో రామసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. మిగిలిన రెండు స్థానాలకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు అధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నివర్గాల ప్రజలకు అనేక రకాల పథకాలు అమలు పరుస్తున్నాడని పేర్కొన్నారు. బ్రహ్మంసాగర్‌లో ఇప్పటికీ 13 టీఎంసీ నీరు నిల్వ ఉండడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పుడు కావాలన్నా నీరు అందిస్తున్నామన్నారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధరలు ఉండడంతో రైతు పండించిన పంటలను అమ్ముకుంటున్నారు. సమావేశంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మేకల రత్నకుమార్‌యాదవ్, సింగల్ విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, రాజానాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ తథ్యం

బద్వేలు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూసరవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలు భారీ మెజార్టీతో గెలుపొందడం తథ్యమని ఆ పార్టీ ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పేర్కొన్నారు. పోరుమామిళ్ళలో ఆయన యువ నాయకులు ఆదిత్యరెడ్డి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డితో కలిసి పోరుమామిళ్ళ డిగ్రీ కళాశాలలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. వారు మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో ఓటర్లు ఓటింగ్‌కు తరలిరావడం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మద్దతు అన్నారు. మహిళలు, యువకులు తమకు అండగా నిలిచి ఓట్లు వేశారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, వైస్ ఎంపీపీలు చెన్నురాజశేఖర్ పలువురు నాయకులు పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో ఓటుహక్కును వినియోగించుకుంటున్న మహిళలు

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ

ప్రొద్దుటూరు క్రైం : ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. మండలంలోని కామనూరు పీహెచ్‌సీలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు 400 మిల్లీగ్రాముల మాత్రలను అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ మాత్రలు ఎంతో సురక్షితమైనవని, నులిపురుగుల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 104 డాక్టర్ సుబ్రమణ్యం, సీహెచ్ఓ కృష్ణమ్మ, హెచ్ఈ శోభారాణి, సుపర్‌వైజర్ వరప్రసాద్, చంద్రశేఖర్, సీహెచ్ఓలు నాగేంద్ర, దివ్యజ్యోతి, నరసింహ, గంగాధర్, నిర్మల, ఆరోగ్య కార్యకర్తలు నాన్సి, సుప్రజ, అరుణ, దీప్తి, ఉమ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు హనీఫ్‌బాబా, సుబ్రమణ్యం, సిబ్బంది

నేడు నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

బి.కోడూరు : మండలంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని మంగళవారం అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారులు డాక్టర్ ఎస్.వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఎ.ఉదయ్‌కిరణ్‌లు తెలిపారు. విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బి.కోడూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య విస్తరణాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఆరోగ్య విస్తరణాధికారి టి.నరసింహారెడ్డి, సీహెచ్ఓ కె.నాగమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు